18-11-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

# " మధురమైన పిల్లలారా - ఇప్పుడు మీరు సత్యమైన తండ్రి ద్వారా సత్యమైన దేవతలుగా అవుతున్నారు, అందువలన సత్యయుగంలో సత్సంగము చేసే అవసరము లేదు "

**ప్రశ్న:-** సత్యయుగంలో దేవతలు ఏ వికర్మలూ చేయలేరు? ఎందుకు ?

**జవాబు:-** ఎందుకంటే వారికి సత్యమైన తండ్రి నుండి వరదానము లభించింది. ఎప్పుడైతే రావణుని శాపము తగలడం మొదలవుతుందో అప్పుడు వికర్మలు జరుగుతాయి. సత్య-త్రేతా యుగాలలో ఉండేది సద్గతే. ఆ సమయంలో దుర్గతి అన్న మాటే ఉండదు. వికర్మలు జరిగేందుకు అక్కడ వికారాలే ఉండవు. ద్వాపర కలియుగాలలో అందరికీ దుర్గతి కలుగుతుంది. అందువలన వికర్మలు జరుగుతూ ఉంటాయి. ఇవి కూడా అర్థము చేసుకోవలసిన విషయాలు.

**ఓంశాంతి.** మధురాతి మధురమైన ఆత్మిక పిల్లలకు తండ్రి కూర్చుని అర్థం చేయిస్తున్నారు - "వీరు సుప్రీం తండ్రే కాక, సుప్రీం టీచర్, సుప్రీం సద్గురువు కూడా అయ్యారు. ఈ విధంగా తండ్రి మహిమను తెలుపుట వలన ఆటోమేటిక్‌గా(స్వతహాగా) ఈ విషయాలు సిద్ధమౌతాయి - కృష్ణుడు ఎవ్వరికీ తండ్రి కాజాలడు. కృష్ణుడు చిన్న బాలుడు. సత్యయుగంలోని ప్రప్రథమ రాకుమారుడు (ప్రిన్స్). అతడు టీచరు కూడా కాదు. స్వయం అతడే ఒక టీచరు వద్ద కూర్చుని చదువుకుంటాడు. అక్కడ గురువే ఉండడు. ఎందుకంటే అక్కడ అందరూ సద్గతిలో ఉంటారు. అర్ధకల్పము సద్గతి, అర్ధకల్పము దుర్గతి ఉంటుంది. అక్కడ సద్గతి ఉంటుంది. కావున అక్కడ జ్ఞానము అవసరమే ఉండదు. జ్ఞానమనే పదము కూడా ఉండదు. ఎందుకనగా జ్ఞానము వలన 21జన్మలకు సద్గతి లభిస్తుంది. తర్వాత మళ్లీ ద్వాపరము నుండి కలియుగాంతము వరకు దుర్గతి ఉంటుంది. అలాంటప్పుడు కృష్ణుడు ద్వాపరంలో ఎలా వస్తాడు? ఇది కూడా ఎవ్వరికీ తోచదు. ఒక్కొక్క మాటలో చాలా నిగూఢ రహస్యము ఇమిడి ఉంది. అది అర్థము చేయించడం చాలా అవసరము. వారు సుప్రీమ్ తండ్రి, సుప్రీమ్ టీచరు. ఇంగ్లీషులో పరమ్‌ను సుప్రీం అని అంటారు. ఇంగ్లీషులో కొన్ని పదాలు చాలా బాగుంటాయి. ఉదాహరణకు 'డ్రామా' అనే పదాన్ని తీసుకోండి. డ్రామాను నాటకమని అనరు. నాటకంలో మార్పులు, చేర్పులూ ఉంటాయి. ఈ సృష్టి చక్రము తిరుగుతూ ఉంటుందని కూడా అంటారు. కాని అది ఎలా తిరుగుతుంది? ఉన్నదున్నట్లుగా తిరుగుతుంటుందా? లేక మారుతూ ఉంటుందా? అనేది ఎవ్వరికీ తెలియదు. తయారై తయారౌతూ ఉందని కూడా అంటారు. ఇది అచ్చంగా ఒక ఆట లాంటిదే. మళ్లీ చక్రం వలె తిరుగుతూ ఉంటుంది. ఈ చక్రములో మనుష్యులే తిరగాల్సి ఉంటుంది. అయితే ఈ చక్రము ఆయువు ఎంత? ఇది ఎలా పునరావృత(రిపీట్)మఅవుతుంది ? ఒకసారి తిరిగేందుకు ఎంత సమయం పడుతుంది? ఇది ఎవ్వరికీ తెలియదు. ఇస్లామ్ మతము, బౌద్ధ మతము మొదలైనవన్నీ 'వంశాలు'. డ్రామాలో వీటన్నిటికీ పాత్ర ఉంది.

బ్రాహ్మణులైన మీకు వంశము ఉంటుంది. ఇది బ్రాహ్మణ కులము. సర్వోత్తమ బ్రాహ్మణ కులము అని పిలువబడ్తుంది. దేవీ దేవతలది కూడా కులమే. దీనిని అర్థం చేయించడం చాలా సహజం.

సూక్ష్మవతనంలో ఫరిస్తాలు(ఏంజిల్స్/Angels) ఉంటారు. అక్కడ వారికి ఎముకలు - మాంసము ఉండవు. దేవతలకు ఎముకలూ, మాంసము ఉంటాయి కదా. విష్ణువే బ్రహ్మ, బ్రహ్మయే విష్ణువు. విష్ణువు నాభి కమలము నుండి బ్రహ్మను ఎందుకు చూపించారు? సూక్ష్మవతనంలో ఇలాంటి విషయాలుండవు. నగలు మొదలైనవి కూడా ఉండవు. అందుకే బ్రహ్మను శ్వేత వస్త్రాలను ధరించినట్లు చూపిస్తారు. బ్రహ్మ సాధారణ మానవుడు. అనేక జన్మల అంతములో పేదవాడిగా అయ్యాడు కదా. ఈ సమయంలో ఉండేవే ఖద్దరు వస్త్రాలు. పాపం! వారికి సూక్ష్మ శరీరమంటే ఏమిటో తెలియదు. మీకు తండ్రి అర్థము చేయిస్తున్నారు - అక్కడ ఉండేదే ఫరిస్తాలు(సూక్ష్మదేవతలు). వారికి మాంసము, ఎముకలు ఉండవు. సూక్ష్మవతనములో అయితే ఈ అలంకరణలు మొదలైనవి ఉండవు. కాని చిత్రాలలో చూపిస్తారు. కావున బాబా వాటినే సాక్షాత్కారము చేయించి తర్వాత అర్థము వివరిస్తారు. హనుమంతుని సాక్షాత్కారము చేయిస్తారు కదా కాని హనుమంతుని వలె ఏ మనిషీ ఉండడు. భక్తిమార్గంలో అనేక విధాలైన చిత్రాలను తయారు చేశారు. ఎవరికి ఎవరిపై విశ్వాసము ఉంటుందో వారికి ఇటువంటి విషయాలు చెప్తే కోపపడ్తారు. దేవతలు మొదలైన వారిని ఎంతో పూజించి నీటిలో ముంచేస్తారు. ఇదంతా భక్తి మార్గము. భక్తి మార్గపు ఊబిలో గొంతు వరకు మునిగిపోయి ఉన్నారు. మరి వారిని ఎలా బయటకు తీయగలరు. వెలికి తీయడం చాలా కష్టమైపోతుంది. కొంతమంది ఇతరులను వెలికి తీసేందుకు నిమిత్తులై స్వయం వారే మునిగిపోతారు. స్వయం వారే గొంతువరకు ఊబిలో చిక్కుకుంటారు. అనగా కామ వికారంలో క్రింద పడిపోతారు. ఇది అన్నింటికంటే పెద్ద ఊబి. సత్యయుగంలో ఈ విషయాలుండవు. ఇప్పుడు మీరు సత్యమైన తండ్రి ద్వారా సత్యమైన దేవతలుగా అవుతున్నారు. అక్కడ(సత్యయుగంలో) సత్సంగాలు ఉండవు. ఇచ్చట భక్తి మార్గములో సత్సంగము చేస్తూ ఉంటారు. అందరూ ఈశ్వరుని రూపాలే అని భావిస్తారు. కొంచెం కూడా అర్థము చేసుకోరు. కలియుగంలో ఉన్నవారందరూ పాపాత్మలే. సత్యయుగంలో పుణ్యాత్మలే ఉంటారని తండ్రి అర్థము చేయిస్తున్నారు. రాత్రికి పగలుకు ఉన్నంత తేడా ఉంటుంది. మీరిప్పుడు సంగమయుగంలో ఉన్నారు. కలియుగము సత్యయుగము రెండిటి గురించి మీకు తెలుసు. ముఖ్యమైనది - ఈ తీరము నుండి ఆ తీరానికి వెళ్లడం. క్షీర సాగరము విషయ సాగరాల గురించిన మహిమ కూడా ఉంది. కాని వాటి అర్థము ఎవ్వరికీ తెలియదని తండ్రి కూర్చుని తెలియజేస్తున్నారు. ఇప్పుడు తండ్రి కూర్చుని కర్మ, అకర్మ, వికర్మల రహస్యాన్ని అర్థము చేయిస్తున్నారు. కర్మలను మనుష్యులు చేస్తూనే ఉంటారు. వాటిలో కొన్ని కర్మలు అకర్మలుగా, కొన్ని కర్మలు వికర్మలుగా ఉంటాయి. రావణ రాజ్యంలో చేసే కర్మలన్నీ వికర్మలుగానే అయిపోతాయి. అది రామ రాజ్యమైనందున సత్యయుగంలో వికర్మలు జరగవు. తండ్రి నుండి వరదానము పొంది ఉన్నారు. రావణుడు శాపమిస్తాడు. ఇది సుఖ-దుఃఖముల ఆట కదా! దుఃఖంలో అందరూ తండ్రిని స్మృతి చేస్తారు. సుఖంలో ఎవ్వరూ స్మృతి చేయరు. అక్కడ వికారాలుండవు. అంటు కడ్తున్నారని పిల్లలకు తండ్రి అర్థము చేయించారు. అంటుకట్టే విధానము కూడా ఇప్పటిదే. అంటు కట్టడం తండ్రే ప్రారంభించారు. ఇంతకు ముందు బ్రిటీష్ ప్రభుత్వమున్నప్పుడు ఎప్పుడూ వృక్షాలకు అంటు కట్టారని వార్తాపత్రికలలో ఎప్పుడూ వచ్చేది కాదు. ఇప్పుడు తండ్రి కూర్చుని దేవతా ధర్మపు అంటు కట్టడం ప్రారంభించారు. ఇతరులెవ్వరూ ఈ అంటు కట్టలేరు. చాలా ధర్మాలున్నాయి. దేవీ దేవతా ధర్మము ప్రాయః లోపమైపోయింది. ధర్మ భ్రష్టము, కర్మ భ్రష్టమైనందున పేరే ఉల్టా-సుల్టాగా ఉంచారని

తెలుపుచున్నారు. దేవీ దేవతా ధర్మానికి చెందిన వారిప్పుడు మళ్ళీ అదే దేవీ దేవతా ధర్మములోనే రావాలి. ప్రతి ఒక్కరూ ఎవరి ధర్మములోకి వారు వెళ్ళాలి. క్రైస్తవ ధర్మము నుండి దేవీ దేవతా ధర్మములోకి రాలేరు. ముక్తులుగా అవ్వలేరు. కాని దేవతా ధర్మము నుండి ' క్రిశ్చియన్' ధర్మములోకి ఎవరైనా మార్పు చెందిన వారుగా ఉంటే వారు మళ్ళీ తమ దేవీ దేవతా ధర్మములోకి వచ్చేస్తారు. వారికి ఈ జ్ఞాన-యోగాలు చాలా బాగా నచ్చుతాయి. దీని వలన వారు మన ధర్మానికి చెందిన వారని సిద్ధమవుతుంది. దీనిని అర్థము చేసుకునేందుకు ఇతరులకు అర్థము చేయించేందుకు చాలా విశాల బుద్ధి ఉండాలి. ధారణ చేయాలి. కేవలం పుస్తకము చదివి వినిపించరాదు. ఉదాహరణానికి గీతను వినిపించినప్పుడు మనుష్యులు కూర్చుని వింటారు. కొంతమంది గీతా శ్లోకాలు కంఠస్థము చేస్తారు. కాని ఎవరికి తోచినట్లుగా వారు అర్థాలు తీస్తూ ఉంటారు. శ్లోకాలన్నీ సంస్కృతంలో ఉన్నాయి. ఇక్కడ - సముద్రమునంతా ఇంకుగా మార్చి, పూర్తి అడవినంతా కలము(పేనా)లుగా తయారు చేసి వ్రాసినా జ్ఞానానికి అంతముండదని మహిమ ఉంది. గీత అయితే చాలా చిన్నది. 18 అధ్యాయాలున్నాయి. చిన్న గీతను తయారు చేసుకొని మెడలో కూడా ధరిస్తారు. అందులో అక్షరాలు చాలా చిన్నవిగా ఉంటాయి. మెడలో ధరించే అలవాటు కూడా అవుతుంది. చాలా చిన్న లాకెట్‌గా తయారు చేస్తారు. వాస్తవానికి ఒక సెకండు విషయమే. తండ్రికి చెందిన వారిగా అయ్యారంటే విశ్వమంతటికీ యజమానులుగా అయినట్లే. "బాబా! నేను ఒక్కరోజు బిడ్డనే" అని కూడా వ్రాస్తారు. ఒక్క రోజులో నిశ్చయమైన వెంటనే జాబు వ్రాస్తారు. పుత్రునిగా అవుతూనే విశ్వానికి యజమానిగా అవుతాడు. ఇది కూడా కొంతమంది బుద్ధిలో కష్టము మీద కూర్చుంటుంది. మీరు విశ్వానికి అధిపతులుగా అవుతారు కదా! అక్కడ ఇతర ఏ ఖండమూ ఉండదు. నామ-రూపాలన్నీ మాయమై పోతాయి. ఫలానా ఖండముండేదని ఎవ్వరికీ తెలియను కూడా తెలియదు. ఒకవేళ ఉండి ఉంటే దాని చరిత్ర-భూగోళము కూడా ఉండాలి కదా. అక్కడ ఇది ఉండనే ఉండదు. అందువల్లనే మీరు విశ్వానికంతా మాలికులుగా అవుతారని అంటున్నారు. బాబా చెప్తున్నారు - నేను మీ తండ్రినే కాక జ్ఞానసాగరుడను కూడా. ఇది చాలా ఉన్నతమైన జ్ఞానము. దీని ద్వారా మనము విశ్వానికి అధిపతులుగా అవుతాము. మన తండ్రి సుప్రీమ్, సత్యమైన తండ్రి, సత్యమైన టీచరు. వారు సత్యమునే వినిపిస్తారు. అనంతమైన శిక్షణనిస్తారు. అనంతమైన గురువు అందరికీ సద్గతినిస్తారు. ఒకరి మహిమ మరొకరికి ఉండదు. వారి సమానంగా తయారు చేసినప్పుడే సమానంగా ఉంటుంది. కావున మీరు కూడా పతితపావనులుగా అయ్యారు. సత్యమైన పేరును (సత్ నామ్) వ్రాస్తారు. పతిత పావనులైన గంగలు ఈ మాతలే. శివశక్తి అనండి లేక శివ వంశీయులని అనండి. మీరు శివ వంశీ బ్రహ్మకుమార - కుమారీలు. అందరూ శివ వంశీయులే. కాని బ్రహ్మ ద్వారా రచిస్తారు కనుక సంగమ యుగములోనే బ్రహ్మకుమార - కుమారీలుగా అవుతారు. బాబా బ్రహ్మ ద్వారా దత్తత(ఎడాప్ట్/Adopt) తీసుకుంటారు. మొట్టమొదట బి.కె లుగా అవుతారు. ఎవరైనా అభ్యంతరము చేస్తే " వీరు ప్రజాపిత, వీరిలో తండ్రి ప్రవేశిస్తారని చెప్పండి. అనేక జన్మల అంత్యములో నేను ప్రవేశిస్తాను " అని తండ్రి చెప్తున్నారని చెప్పండి. విష్ణు నాభి నుండి బ్రహ్మ వెలువడినట్లు చూపిస్తారు. అయితే ఆ విష్ణువు ఎవరి నాభి నుండి వచ్చారు? అందులో బాణపు గుర్తు వేసి ఒకరి నుండి ఒకరు వస్తారని చూపించవచ్చు. బ్రహ్మనే విష్ణువు, విష్ణువే బ్రహ్మ. అతడు ఇతని నుండి జన్మించాడు, బ్రహ్మకు అతని నుండి జన్మించాడు. ఇతనికి ఒక్క సెకండు,

విష్ణువుకు 5 వేల సంవత్సరాలు పడ్తుంది. ఇవి ఆశ్చర్యము కలిగించే విషయాలు కదా! మీరు కూర్చుని అర్థము చేయించండి. తండ్రి అంటున్నారు - లక్ష్మీనారాయణులు 84 జన్మలు తీసుకుంటారు. మళ్లీ వారి అనేక జన్మల అంతములో నేను ప్రవేశించి ఇలా తయారు చేస్తాను. ఇవి అర్థము చేసుకోవలసిన విషయాలు కదా. మీరు వచ్చి కూర్చుంటే వీరిని బ్రహ్మ అని ఎందుకు అంటారో అర్థము చేయిస్తాము. పూర్తి ప్రపంచమంతటికి చూపించేందుకు ఈ చిత్రాలను తయారు చేశారు. మనము తెలియజేస్తాము. అర్థము చేసుకొనువారే అర్థము చేసుకోగలరు. అర్థము చేసుకోనివారు మన కులానికి చెందినవారు కారని, ఒకవేళ వారు అక్కడకు వచ్చినా వారు ప్రజలలోకి వస్తారని భావించాలి. మనకు వారిని చూస్తే అయ్యో! పాపమని జాలి వేస్తుంది. పేదవారిని పాపం! పేదవారు అని అంటారు కదా. పాయింట్లన్నీ పిల్లలు ధారణ చేయాలి. టాపిక్‌ల(విషయములు) పై ఉపన్యసించవలసి వస్తుంది. ఈ టాపిక్‌లు ఏమైనా తక్కువా? ప్రజాపిత బ్రహ్మ మరియు సరస్వతి ఇద్దరికీ కలిపి నాలుగు భుజాలు చూపిస్తారు. కావున రెండు భుజాలు బ్రహ్మ పుత్రికవి, అంతేగాని పత్నివి(యుగల్) కాదు. వాస్తవానికి యుగల్ రూపము విష్ణువే. సర్వస్వతి బ్రహ్మకు కుమార్తె. శంకరునికి యుగల్ లేదు. అందుకే శంకరుని శివ-శంకరుడని అంటారు. అయితే శంకరుడేం చేస్తాడు? వినాశనమైతే ఆటంబాంబులతో జరుగుతుంది. తండ్రి కూర్చుని తన పిల్లలను తానే స్వయంగా మృత్యువుపాలు ఎలా చేస్తాడు? ఇది పాపమవుతుంది. శ్రమ లేకుండా తండ్రి అందరినీ మళ్లీ శాంతిధామానికి తీసుకెళ్తాడు. లెక్కాచారమంతా చుక్తా చేసుకొని ఇప్పుడు అందరూ ఇంటికి వెళ్తారు. ఎందుకంటే ఇది కయామత్ (వినాశన) సమయము. తండ్రి సేవ చేసేందుకే వస్తారు. అందరికీ సద్గతినిస్తారు. మీరు కూడా మొదట గతి(శాంతిధామము), తర్వాత సద్గతి(సుఖధామము)లోకి వస్తారు. ఇవి అర్థము చేసుకోవలసిన విషయాలు. ఈ విషయాల గురించి కొంచెం కూడా ఎవ్వరికీ తెలియదు. కొంతమంది ఎంత ప్రయత్నించినా చాలా విసిగిస్తారు. వారికి అర్థమే కాదు. బాగా అర్థము చేసుకోగలిగినవారు వచ్చి తెలుసుకుంటారు. ఒక్కొక్క విషయాన్ని అర్థము చేసుకోవాలనుకుంటే సమయాన్ని కేటాయించమని చెప్పండి. ఇక్కడ కేవలం తండ్రి పరిచయము ఇచ్చేందుకు మాత్రమే అనుమతి ఉంది. ఇది ముళ్ల అడవి. ఎందుకంటే ఒకరికొకరు దుఃఖము కలిగించుకుంటూ ఉంటారు. దీనిని దుఃఖధామమని అంటారు. సత్యయుగాన్ని సుఖధామమని అంటారు. దుఃఖధామము నుండి సుఖధామము ఎలా తయారవుతుందో మీకు అర్థము చేయించారు. లక్ష్మీనారాయణులు సుఖధామంలో ఉండేవారు. వారే మళ్లీ 84 జన్మలు తీసుకొని దుఃఖధామములోకి వస్తారు. ఈ బ్రహ్మ పేరును కూడా ఎలా పెట్టారు? "నేను ఇతనిలో ప్రవేశించి అనంతమైన సన్యాసము చేయిస్తాను" అని తండ్రి అంటున్నారు. వెంటనే సన్యాసము చేయిస్తారు. ఎందుకంటే వీరి ద్వారా తండ్రి సేవ చేయించాలి. వారే చేయిస్తారు. ఇతని వెనుక వచ్చిన చాలా మందికి తండ్రి కూర్చుని పేర్లు పెట్టారు. దీనిని ప్రపంచములోనివారు భట్టీలో సురక్షితంగా ఉన్న పిల్లి కూనలుగా చూపిస్తారు. ఇవన్నీ కట్టుకథలు. పిల్లి పిల్లలు ఎలా అవుతారు? పిల్లి కూర్చుని జ్ఞానము ఎలా వినగలదు? అది జ్ఞానమేమీ వినలేదు. తండ్రి చాలా యుక్తులు తెలుపుతూ ఉంటారు. ఏ విషయమైనా, ఎవరికైనా అర్థము కాకుంటే, వారు ఎంతవరకు ఆల్ఫ్(బాబా)ను అర్థము చేసుకోలేదో అంతవరకు ఇతరమేదీ అర్థము కాదని చెప్పండి. ఈ విషయాన్ని నిశ్చయము చేసుకొని వ్రాయండి, లేకుంటే మర్చిపోతారని వారికి చెప్పండి. మాయ మరిపింపజేస్తుంది. ముఖ్యమైనది - "తండ్రి

పరిచయమే". మా తండ్రి సుప్రీమ్ తండ్రి, సుప్రీమ్ టీచరు. విశ్వమంతటి ఆది, మధ్య, అంతముల రహస్యాన్ని తెలుపుతున్నారు. దీనిని గురించి ఎవరికీ తెలియదు. దీనిని అర్థము చేయించేందుకు సమయం పడ్తుంది. తండ్రిని తెలుసుకోనంత వరకు ప్రశ్నలు వేస్తూనే ఉంటారు. అల్ఫ్‌ను గురించి అర్థము చేసుకోకుంటే 'బే ' అంటే వారసత్వమును గురించి ఏ మాత్రము అర్థము చేసుకోలేరు. ఊరకే సంశయ పడుతూ ఉంటారు. ఇలా ఎందుకు? శాస్త్రాలలో ఇలా చెప్పారు కదా! అని అంటారు. అందుకే మొదట తండ్రి పరియమును ఇవ్వాలి. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. కర్మ, అకర్మ, వికర్మల గుహ్యగతిని బుద్ధిలో ఉంచుకుని ఇప్పుడు ఎలాంటి వికర్మలూ చేయరాదు. జ్ఞాన-యోగాలను ధారణ చేసి ఇతరులకు వినిపించాలి.
2. సత్యమైన తండ్రి ఇచ్చిన సత్యమైన జ్ఞానమునిచ్చి మనుష్యులను దేవతలుగా చేసే సేవ చేయాలి. వికారాల ఊబి నుండి అందరినీ వెలికి తీయాలి.

## వరదానము :- " శక్తిశాలి స్థితి ద్వారా మనసా సేవకు సర్టిఫికెట్‌ను ప్రాప్తి చేసుకునే స్వ అభ్యాసీ భవ "

విశ్వానికి లైట్ మరియు మైట్ లను వరదానంగా ఇచ్చేందుకు అమృతవేళలో స్మృతి యొక్క స్వ అభ్యాసము ద్వారా శక్తిశాలి వాయుమండలాన్ని తయారు చేసుకోండి. అప్పుడు మనసా సేవకు సర్టిఫికెట్ ప్రాప్తి అవుతుంది. చివరి సమయంలో మనసా సేవ ద్వారానే దృష్టితో తృప్తి పరచే మీ వృత్తి ద్వారా వారి వృత్తులను పరివర్తన చేసే సేవ చేయాలి. మీ శ్రేష్ఠ స్మృతి ద్వారా అందరిని సమర్థంగా చేయాలి. ఎప్పుడైతే ఇలా లైట్ మైట్ ఇచ్చే అభ్యాసముంటుందో అప్పుడు నిర్విఘ్న వాయుమండలం తయారవుతుంది. అంతేకాక ఈ కోట శక్తివంతమవుతుంది.

## స్లోగన్ :- " ఎవరైతే మనసా-వాచా-కర్మణా మూడు సేవలు జత జతలో చేస్తారో వారే తెలివిగలవారు. "